# విమల

పోట్లూరి వెంకటేశ్వరరావుగారు

భానుడు తన మాతృగర్భమునుండి మెల్లమెల్లన ఆకాశముపైకి వచ్చుచుండెను. సూర్యకిరణ ప్రసారముచే తామరకోరకములు తమ నిర్మలరేఖలను వికసింపజేసి చూపరులకు ఆనందమును గొలుపుచుండెను. జనులు వారివారి దినకృత్య నిర్వహణార్థము వడివడిబాటలబడి చనుచుండిరి. అట్టితఱి విమల పాశ్చాత్య వనితవలె నలంకరించుకొని స్నేహితురాండ్రను కలసికొనుటకు మహిళాసంఘమున కేగెను.

ఈమెవెళ్ళిన సుమారొక అరగంటకు మహిళాసంఘసభ ప్రారంభమాయెను. ఆ సభయందు విమలలేచి "సోదరీమణులారా! ఈ సభయందు స్త్రీస్వాతంత్ర్యమునుగూర్చి యొక్కింత ముచ్చటింపదలచితి. మనము మగవారికోర్కెలనుదీర్చి, శరీరదార్ఢ్యమునుగూడ గోల్పోయి సంతానాభివృద్ధి గావించుచున్నారము. భర్త కొట్టినను, తిట్టినను అనేక కష్టముల పాల్పరచినను విధిలేక అణగిపడియుండుచుంటిమి. "భార్యకు భర్తయే దైవము" అను సూక్తి పూర్వమునుండియు వచ్చుచున్నదిగాన మనము యిన్నియిక్కట్లు పడవలసినవారమైతిమి. ఆ సూక్తులకర్తలు పురుషులేగాని స్త్రీలుగారు. దాన స్త్రీలకన్యాయమొనరింపబడినది. ఈ నాటినుండియు పురుషులవలె మనముగూడ స్వాతంత్ర్యముగలిగి యుండవలెను" అని యుపన్యసించగనే 'మహిళా సంఘమునకు జై' అను నినాదములతో సభముగిసెను. విమల మహిళాసంఘాధ్యక్షురాలు!

విమలభర్త రమేశ్ ఎంత సేపటికిని భార్య యింటికి రాకపోవుటచే ఎదురు చూచిచూచి విసుగుచెంది వంట ప్రయత్నములు చేసికొనుచుండెను. అప్పటికిని రాకుండుటచే వంటకూడ అష్టకష్టములపడి నిర్వర్తించెను. ఇంతలో విమల కూనరాగములు ఆలాపించుకొనుచువచ్చి తలుపుతట్టినది.

రమేశ్ తలుపు తెఱచెను. ఎన్నడునుకనివిని ఎఱుగని పరిమళవాయు వీచికలు విమల శరీరమునుండి వీయ ఆ సువాసనలాతనికి మత్తుగల్గించెను. కాని ఎటులనో ఆ మత్తును సడలించుకొని కోపముగ "విమలా! నీవు హద్దుమీరి వర్తించుచున్నావు. ఎంతకును నీవు రాకుండుటజేసి సర్వఅవస్థలపడి వంట చేసితిని. యిటమీదటయినను బాగుగ మెలగుము. ఈ మాటలన్నియు నిపుడేల? భోజనము వడ్డింపుము." అని రమేశ్ భార్యనుగట్టిగ మందలించెను. విమల మారుమాటాడక వంటగది చేరెను.

భోజనమైన తరువాత విమల విశ్రమించినది. సాయంతనమయ్యెను. శకుంత సంతానములు వృక్షాగ్రములనున్న గూండ్లను జేరికొనుచుండెను. పశ్చిమ దిక్కాంతయు రక్తసిక్తంబయిన వస్త్రమారగట్టినట్లుండ, సూర్యుడస్తమింపదొడగెను.

విమల యథాప్రకారముగ సింగారించుకొని పాశ్చాత్యవనితలు పట్టుకొనుచేతిసంచి చేతిలోనుంచుకొని బయలుదేరెను. రమేశ్ అదిగాంచి "మరల ఎచటికేగుచుంటివి విమలా?" అని ప్రశ్నించినాడు. "షికారుకు వెళ్లుచుంటిని. ప్రొద్దునవలె వంటయొనర్చి అమ్మాయిని కనిపెట్టుకొని యింటనుండుడు" అని చెప్పి చరచరనడిచిపోయినది. రమేశ్ అతివిచారముతో మట్టిముద్దవలె అచటనే కూలబడెను.

ఇంతలో తలుపు ఎవరో గబగబతట్టిరి. పోయిన ప్రాణము తిరిగివచ్చినట్లయిన దతనికి. విమల వచ్చెనను ఆశచే తలుపుతీసెను. అతనిఆశ నిరాశఅయినది. దేహమంతయు క్రొత్తకుండ చెమర్చినట్లు చెమటతో నిండగా ఇద్దరు స్నేహితులనుగాంచి నిర్ఘాంతుడై నిలబడెను రమేశ్.

స్నేహితులిద్దరు నవ్వుచు "ఏమిరమేశ్! అటుల ప్రాణములేని జీవివలె నిలబడితివి?" అని ప్రశ్నించిరి. "ఏమిచెప్పను; నా భార్య యింటిపనులన్నియు నానెత్తిపైపడవేచి తాను సంఘసేవలని, సినీమాలని, స్త్రీ స్వాతంత్ర్యమని, మనకంటె ఎక్కువ పనులలో జోక్యము కలుగజేసికొనుచున్నది. అదేమి? అని ప్రశ్నించిన మారాడక తన పనులు తాను చేసికొనును. ఇట్టి పరిస్థితులలో ప్రాణములేనికట్టెనుగాక మరేమి?" అనెను రమేశ్.

"సరి రోలువచ్చి మద్దెలతో మొఱపెట్టుకొన్నటుల నీవు మాతో మొఱయిడుకొనుచుంటివి. మన మువ్వురమును ఒకేయవస్థకు పాల్పడితిమి. దీనికితగిన యుపాయమాలోచింపవలెను. లేనిచో మనకింత గంజినీళ్ళైనను పుట్టదు" అని స్నేహితులు చనిరి.

♦ ♦ ♦ ♦

మఱునాటిరాత్రి 7 గం॥లకు విమల దుస్తులనుమార్చుకొని సినిమాతారవలె సింగారించుకొని బయలు దేరినది. ఎచటికో? రమేశ్ అనుమానముతో ఆమెను రహస్యముగా వెంబడించెను.

విమల తనస్నేహితుడగు ప్రకాశ్ గృహమునకేగి అతనితో చేయీచేయికలిపి నవ్వుతూ, నిర్మల హృదయముతో షికారు బయలు దేరినది. దానితో రమేశ్ అనుమానము బలపడినది. చేయునదిలేక యిల్లుచేరెను.

విమలా ప్రకాశ్‌లు ఆనందముగ బీచియొడ్డునకు జేరిరి. ప్రకాశ్ ఎంతో స్త్రీ స్వాతంత్ర్యప్రియుని వలె విమలతో సంభాషించుచు, మధ్యమధ్య ప్రేమపలుకులు పలుకుచుండెను. స్త్రీ స్వాతంత్ర్యాభిలాషా జలధిలో మునిగియున్న విమల అతనిప్రేమ ధోరణిని గ్రహింపలేకపోయినది.

సుగంధద్రవ్య వాసనలతో నిండి, పుష్పమువోలె కోమలమగు విమల శరీరమును, సౌందర్యమును వెన్నెలలో గాంచి తన ప్రేమోద్రేకమును ఆపలేక కౌగలించుకొనబోయెను ప్రకాశ్. విమల అది గ్రహించి అతనిని గట్టిగా నొకచెంపపెట్టుపెట్టి "నీచుడా, నీవిట్టి ద్రోహివని ఎన్నడును తలంచలేదు. మావలె నీవు గూడ స్వాతంత్ర్యకాంక్షివని తలంచితినిగాని, సర్వసౌఖ్యముల దులదూగు భార్యాభర్తలపాలిటి పెనుభూత మవని ఎన్నడును తలంచలేదు." అని రోషావేశంతో గృహముచేరినది.

రమేశ్ భార్యనుచూచి "ఎవరునీవు?" అని ప్రశ్నించెను. విమల "అదేమి అటుల అడుగుచుంటిరి. నేను మీ భార్యనుకానా" అని హీనస్వరముతోననెను. "నా భార్య అయినచో నాతోడనే సౌఖ్యమనుభవించుచు సుఖముగా నిద్రించుచుండెడిది. నీవలె భర్తనువదలి పరపురుషునితో స్వేచ్ఛావిహారములుసల్పి అర్ధరాత్రివేళ యీ దురవస్థకు పాల్పడదు" అని రమేశ్ అనెను.

విమల తానొనర్చిన సమస్త విషయములను భర్తచూచి గ్రహించెనను భయముచే మాఱుపలుకక ఒక నిముషము అట్టే నిల్చెను. రమేశ్ కోపముతో నాగుమ్మము త్రొక్కవద్దని గద్దించెను. విమల భర్తపాదములపైబడి జరిగినసంగతివచించి "నేను స్వాతంత్ర్య మపేక్షించినదాననేగాని, అట్టి స్వతంత్రతను పురుష స్నేహ సందర్భమున నుపయోగింపరాదని ఎఱుంగనైతిని. ఇప్పటి పురుషులు (చాలమంది) సంస్కార రహితులు; వారిమనములు సంస్కారము పొందినవెనుకగాని వారితో నేస్తమొనర్పరాదు. స్త్రీ పురుష స్నేహమువలన స్త్రీపురుషుల కిర్వురకో, లేక యిర్వురియందొకరికో చెడుతలంపు లుత్పన్నముకాగలవు. ప్రస్తుతపు దినములలో స్త్రీ పురుషులు స్నేహమొనర్చిన, వారి స్నేహము మోహముగా మాఱవచ్చును" అని తెలిసికొనజాలనైతిని, నాతప్పుక్షమించి నన్ను మీదాననుగా జేర్చికొనుడు. ఇక నెన్నడు మీయాజ్ఞలేనిదే ఎచటికిని పోను" అని ప్రార్థించెను.

రమేశ్, "నీవు పాశ్చాత్య నాగరికతానుగుణముగ నలంకరించుకొనుట నాకిష్టములేదు" అనెను. విమల తానానాటినుండి హిందూవనితవలె నలంకరించుకొనెదనని బాసయొనర్చెను.

ఆదినమునుండి ఆభార్యాభర్తలిద్దరూ చిలుక, గోరువంకలవలె సుఖసౌఖ్యములతో ఆనందదాయకముగ కాలము గడుపుచుండిరి. విమల మహిళాసంఘసేవ బాగుగ నొనర్చుచున్నది.